# ప్రతీకారం

రైలు మెల్లిగా బ్రేకులు చప్పుడు చేసుకుంటూ ఆగింది. రాజయ్య కిటికీలోనుంచి తల బయటకుపెట్టి స్టేషను పేరు మళ్ళీ ఒకసారి చదువుకున్నాడు. జేబులోనుంచి టిక్కెట్టు తీసి చూశాడు. అదే వూరు. గబగబా బెర్తుమీద పెట్టిన సంచీ తీశాడు.

రైలు కూత కూసింది. అటూ ఇటూ చూస్తూ జారిపోతున్న చెప్పు సరి చేసుకుని ఆదుర్దాగా కిందికి దిగాడు.

టిక్కెట్టు వసూలు చెయ్యటానికి ఎవ్వరూ లేరు. గంట కొట్టే చోట నిలబడిన వ్యక్తికి అంతా టిక్కెట్లిచ్చి వెళ్ళిపోతున్నారు.

జట్కా వాళ్ళంతా ప్లాటుఫారంమీదికి వచ్చి సామాన్లు అందుకుంటున్నారు.

'అయ్యగారూ... బండీ కట్ట మంటారా... !

'ఊళ్లోకి ఎంతదూరం...'

'రథం దగ్గరకేనా...'

'ఆ... ఆ...'

'పావలా డబ్బు లిప్పించండి...'

'బండీ వద్దులే... వూరికేనే అడిగాను...' అన్నాడు రాజయ్య. బండివాడు నిరుత్సాహంగా ముఖంపెట్టి 'జట్కా జట్కా...' అంటూ అరుచుకుంటూ పోయాడు

రాజయ్య కళ్ళు ఎవరికోసమో వెదుకుతున్నాయి. చేతిలో సంచీ భద్రంగా పెట్టుకుని పెద్దగా అడుగులు వేసుకుంటూ బయలుదేరాడు.

'రథం పక్కన గూడెంలో...' తలఎత్తి పైకిచూశాడు. ఆ మాటే పునశ్చరణ చేసుకున్నాడు.

స్టేషను దాటి కొద్దిదూరం పోగానే దారిలో కాలవ ఒకటి అడ్డం వచ్చింది. వంతెన కొద్ది దూరంలోనే ఉంది. అక్కడినుంచి చూస్తే రథం... దాని పక్కన గుడి, గాలిగోపురం కనపడ్డాయి.

అతనిలో రక్తం ఉరకలు వేసింది 'అక్కడే... అక్కడే...' అంటూ గొణుక్కున్నాడు.

కాలువ ఎండిపోయింది. అక్కడక్కడ నీరు గుంటల్లో నిలిచింది. అదయినా బాగా మురుగుపట్టిపోయింది. ఒకటి రెండు కప్పలు మురుగు లోంచి బయటకువచ్చి బెకబెకమంటున్నాయి. మెల్లిగా నడుస్తూ పోతు న్నాడు. గాలి చల్లగానేఉంది. కాని అతని వంటికి వెచ్చగా తగులుతోంది. గుండె కొంచెం దడదడలాడింది. 'ఇంకెంత సేపు' అనుకున్నాడు.

ఈ క్షణం కోసం ఎదురుచూస్తున్నాడు తాను. మధుర క్షణం కాదు. అతనికి మనశ్శాంతి దొరకబోయే క్షణం.

శంకరయ్యది ఈ వూరని తెలుసుకోవటమే కష్టం అయింది. అతని ఆచూకీ తీయటంకోసం పోలీసులతోపాటు తనూ తిరిగాడు. ఎందరినో అడిగాడు. ఎన్నివూళ్ళో గాలించాడు.

అతన్ని తాను బాగా గుర్తుపట్ట గలడు... పెద్దనుదురు నుదుటిపై ఎడమపక్క నల్లటి మచ్చ... అణుచుకుపోయిన ముక్కు... అన్నింటిని మించి ఆ కళ్ళను తాను ఎన్నటికి మరచిపోలేదు.

వంతెన వచ్చింది. రథం ఇంకెంతో దూరం లేదు.

ఒక్కక్షణం ఆగాడు. అడుగుల చప్పుడవుతే వెనక్కి తిరిగి చూశాడు. ఎవరో తన నెరగని వాళ్ళు.

వంతెనకింద నిలిచిన నీళ్ళలో ఎవరో చేపలు పట్టుకుంటున్నారు. గట్టుమీద కొద్ది దూరంలో సరివితోపు ఉంది. అక్కడినుంచి వస్తున్న గాలి హోరుమని చప్పుడు చేస్తోంది.

ఆకాశం నిర్మలంగా ఉంది. తన మనసు నిర్మలంగా లేదు.

రాజయ్య చకచకా నడవ సాగాడు.

ఇంటిదగ్గర తమ్ముడు పొలం పనిలోకి వెళ్ళి ఉంటాడు. తను ఆ పని వదిలి ఇక్కడకు వచ్చాడు. ఆ పొలం... రాజయ్య కళ్ళల్లో నీళ్ళు తిరిగి ఎత్తైన చెక్కిళ్ళమీదికి జారినాయి. కళ్ళు జేవురు రంగు పూసుకున్నాయి. ఆ పొలం... అక్కడ నెత్తురు చిందింది. తను మరిచిపోలేడు... అమ్మ ఎంత ఏడ్చింది. తను ఓదార్చలేక పోయాడు. తనంటే ఎంత ప్రేమ చెల్లెలికి. అన్నం గిన్నె తట్టలోనుంచి తీసి తనకిస్తే... తాడిచెట్టుకింది ఆ కొద్ది నీడలో ఇద్దరూ కూర్చుని తినేవాళ్ళు. ఆ చల్లని రోజులు మళ్ళీ ఎలా వస్తాయి !

రాజయ్య గొంతులో ఏదో మాట పెనగులాడింది. మళ్ళీ దుఃఖం పొర్లివచ్చింది. ఆవేశం పొంగి పొర్లింది. రథంవంక మళ్ళీ చూశాడు. ఇంకెంత సేపు...

రేపు ఇంటికి వెళతాడు. తమ్ముడు ఎదురువస్తాడు. 'వెళ్ళిన పనయిందిరా' అని అడుగుతుంది అమ్మ. తను 'అయిందంటాడు... కాని అమ్మకు తెలియదు. నేనింకా పొలం బేరానికి వెళ్ళాననుకుంటుంది.

తను అప్పుడు నిజం చెప్పాలి. రక్తసిక్తమైన కత్తితీసి ఆమె పాదాల ముందు పెడతాడు. అమ్మ సంతోషిస్తుందా...ఏమో అమ్మకు చెప్పకూడదు. మళ్ళీ అమ్మకు చెల్లెలిమాట జ్ఞాపకం చెయ్యటం ఎందుకు !

ఆనాడు చెల్లెలుపెట్టిన కేక ఈ నాటికీ చెవుల్లో గింగురు మంటోంది. గడ్డివాము నీడలో కూర్చున్న చెల్లెలికి ఇంత దురాగతం తలపెడతాడా... వాడికీ చేతులెట్లా వచ్చినాయి. అసలు అవి చేతులేనా...

రాజయ్య శరీరం భగ్గున మండిపోయింది.

వంతెన దాటగానే రోడ్డు రెండుగా చీలింది. రథం వైపు పోయే రోడ్డుకు తిరిగాడు. రోడ్డు మొదట్లోనే కాఫీహోటలు కనబడింది. ముందు ఆకలిబాధ తీర్చుకుందా మనుకున్నాడు. లోపలకు వెళ్ళి నాలుగువైపులా కలయచూశాడు. బీరువాలో తినుబండారాలున్నాయి. గదిలో మధ్య తడికె ఉంది. తడికె వెనకాల ఎవరో పిండి రుబ్బుతున్న చప్పుడవు తోంది. దొడ్లో కుక్కలు పోట్లాడుకుంటున్నాయి. కోడిపకటి పిల్లల్ని వెంటబెట్టుకుని గదిలో కిందపడ్డ గింజలను ఏరుకు తింటోంది. రాజయ్య వక పక్కగాపోయి కూర్చున్నాడు. అక్కడ మట్టి గోడలో వాసం కర్రలతో ఏర్పాటు చేసిన కిటికీలోనుంచి రథం కనబడుతోంది.

ఎవరో వచ్చారు. 'ఏం కావాలయ్యా...' అన్నాడు.

'ఇడ్డెన్లున్నాయా... !'

'ఉన్నాయి... !'

'ఒక ప్లేటు రానీ... !'

రథంమీద పావురాలు ఎగురుతున్నాయి.

బల్లమీద ఈగలు ముసురుతున్నాయి.

అతని దృష్టి అటూ ఇటూ వూగిసలాడుతోంది.

శంకరయ్య చేతిలో ఆనాడు కత్తి ఉంది. తన చేతిలో కనీసం కర్రయినా అందుబాటులో లేదు... లేకపోతే ఇంతదాకా వచ్చేది గాదు. ఆ రోజునే తేలిపోయేది వ్యవహారం.

ఇడ్లీ పొగలు కక్కుతోంది.

'అట్టు వేయించ మంటావా...' అంటున్నాడు హోటలువాడు.

తను కూర్చున్న బల్ల ముందుకూ వెనక్కూ ఊగుతోంది.

అట్లతద్దినాడు దొడ్లో చింతచెట్టుకు ఉయ్యాల వేశాడు. చెల్లెల్ని కూర్చోపెట్టి ఊపాడు. పెద్ద ఊపు రాగానే చెల్లెలు పళ్ళు బిగపెట్టి తాడు గట్టిగా పట్టుకుంది. ఊపు ఆగగానే 'అంత ఊపు వేస్తావెందుకు... నా కెంత భయం వేసిందో తెలుసా!' అన్నది.

'అంత వేసిందా...' అన్నాడు తాను చేతులు బార జాపుతూ.

తానుగూడా ఉయ్యాలమీద నుంచుని పెద్దపెద్ద ఊపులు ఊగాడు. చెల్లెలు తన కాళ్ళమధ్య కూర్చుని కాళ్ళు రెండు గట్టిగా పట్టుకుంది. తను పక్కనే ఉంటే ఎంత ధైర్యం తన చెల్లెలికి. కాని... ఆ నాడు తను ఏం చెయ్యగలిగాడు ?

పొలంలో తను, తన చెల్లెలు. మెళ్ళో రెండుపేటల బంగారు గొలుసు మెరుస్తోంది. కనుచూపు మేరలో ఎవ్వరూ లేరు. చెల్లెలు పొలం గట్టున పడిఉన్న నత్తగుల్లలు ఏరుకుంటోంది. ఒక్కసారి అరవటం వినిపించింది. పరుగెత్తాడు అటువైపు. ఎవరో చెల్లెలితో పెనుగులాడు తున్నాడు. తను ఇంకా పరుగెత్తాడు. అతని చేతిలో ఏదో తళ తళ లాడింది. చెల్లెలు గావుకేకపెట్టి పడిపోయింది. తను వెళ్ళాడు. అతని

చేతిలో కత్తి ఉంది. తను ఎదిరించాడు. తననుగూడా పొడవబోయాడు. తన చేతిలో కర్రయినా లేదు. తను పొలికేక పెట్టాడు. నలుగురూ చేరే లోపున వాడు పారిపోయాడు. గొలుసు పోయింది. చెల్లెలు పోయింది. రాజయ్య సర్వస్వము పోయినట్లయింది.

అతన్ని చూశాడు. ఆ నుదురు... ఆ మచ్చా... ఆ కళ్ళుఅన్నీ చూశాడు. ఆ చెల్లెలికి పెళ్ళి చెయ్యాలని... ఆ పొలం ఆమెకు రాసి యివ్వాలనీ అనుకున్న రాజయ్య పళ్ళు పటపట లాడించాడు.

'ఇడ్డెన్లో రాయి వచ్చిందా...' అన్నాడు హోటలులో పక్కనే కూర్చున్నవాడు.

రాజయ్య సంచీ దగ్గరకు తీసుకున్నాడు. బరువుగా లేచి డబ్బు లిచ్చేసి బయటకు వచ్చాడు.

రథం పక్కగా ఒక సైకిలు దుకాణం ఉంది. ఒకబ్బాయి అతి ప్రయాసతో సైకిలుకు గాలి కొడుతున్నాడు.

'శంకరయ్య ఉండే దెక్కడ...' రాజయ్య అతన్ని మెల్లిగా అడిగాడు.

సైకిలు కుర్రాడు పంపు పక్కనపెట్టి చొక్కాతో ముఖం తుడుచుకొని 'ఎవరూ...' అంటూ అనుమానంగా అడిగాడు.

'శంకరయ్య... గూడెంలో ఉంటాడుట...!'

'మా నాన్న సంగతేనా...!'

రాజయ్య నిశ్చేష్టు డయ్యాడు.

'చింతచెట్టుంది చూశావా... అదే... ఇంటికి సున్నం చారలుగూడా ఉన్నాయి...' అన్నాడు ఆ అబ్బాయి.

రాజయ్య అక్కడ వక్క క్షణంగూడా ఉండలేక పోయాడు. గబగబా అడుగులు వేసుకుంటూ గుడి మండపం మీదికిచేరాడు. అక్కడి నుంచి చింతచెట్టు కనబడుతోంది. దొడ్లో వరల్లేని బావిముందు నిలబడి నీళ్ళు తోడి పోసుకుంటున్నారు.

సంచీలో కత్తిని తడిమి చూశాడు. చల్లగా తగిలింది. అతని శరీరం వెచ్చబడింది. పెదిమలు వణికినాయి. శరీరం గగుర్పాటు చెందింది.

'ఏవూరు మనది...' పక్కనే కూర్చున్నాయన అడిగాడు.

భుజాన కూర్చున్న కుర్రవాడు రావి ఆకులు తుంచి బూరలు చుట్టు కుంటున్నాడు.

'ఎవరింటికి వచ్చారు...' ఆయన మళ్ళీ అడిగాడు.

రాజయ్య అతనివంక తీవ్రంగా చూసి అక్కడినుంచి వచ్చేశాడు. బయటకు వచ్చి చూసేటప్పటికి ఎక్కడెక్కడినుంచో పావురాలు ఎగురు కుంటూ వచ్చి రథంమీద వాలుతున్నాయి. తెల్లటి పావురాలు రెక్కలు టపటపలాడిస్తూ రథంచుట్టూ తిరుగుతుంటే ఎక్కడినుంచో తనకు శాంతి సందేశం తీసుకు వస్తున్నట్లుంది. తన హృదయం శాంతించదు. తనలో చెలరేగే అశాంతి స్వరూపం వాటికేం తెలుసు అనుకున్నాడు.

శంకరయ్య ఆ రాత్రికి ఇంటికి వస్తాడని తెలిసింది. అతన్ని పట్టు కోవటానికి పోలీసువాళ్ళు గూడా వచ్చారు. గూఢచారుల్లాగా తిరుగు తున్నారు వాళ్ళు.

రాజయ్య సరివితోపు ముందు నిలబడ్డాడు. హోరుమని గాలి శబ్దించేస్తోంది. కీచురాళ్లు గీపెట్టుతున్నాయి.

కాలవ గట్టువెంబడి నడుస్తున్నాడు.

రోడ్డుమీద కెవ్వున కేక వినిపించింది. ఉలిక్కిపడ్డాడు రాజయ్య.

రాజయ్యకి చెల్లెలు పిలిచినట్లు అనిపించింది. అటువైపు పరుగెత్తాడు.

అక్కడ నిలబడ్డ లారీ ఒకటి ఇతన్ని చూడగానే రివ్వుమని బయలుదేరి వెళ్ళిపోయింది. రోడ్డుమీద ఎవరో పడిపోయాడు. రాజయ్య ఆదుర్దాగా వెళ్ళి చూశాడు. ముఖమంతా రక్తసిక్తమై ఉంది. మాటలేకుండా పడిపోయాడు.

రాజయ్య ధర్మసంకటంలో పడ్డాడు. ఆపదలో ఉన్నవాడిని రక్షించటం అంటే రాజయ్య ఎప్పుడూ ముందుకు తూగేవాడే. కాని ఈ రోజున తను వచ్చిన పని వేరు.

శంకరయ్య ఏ క్షణాన్నైనా అటువైపుకు రావచ్చును. తనిక్కడ ఉండిపోతే అతను తన చేతికి చిక్కడు. మళ్ళీ అవకాశం దొరకదు. తనలో రేగుతున్న దావానలం మళ్ళీ అవకాశం కోసం ఆగుతుందా... రాజయ్య సంకటపడి పోయాడు. లారీకింద పడ్డవ్యక్తి గిజగిజలాడిపోతున్నాడు. తన మనస్సు శంకరయ్య ప్రాణంకోసం తహతహలాడిపోతోంది.

రాజయ్య నుదుటిమీద చెమట పట్టింది.

ఒక్కొక్క క్షణం ఒక్కొక్క యుగంగా గడుస్తోంది.

ఏ క్షణంలోనైనా శంకరయ్య తన దృష్టిలో పడకుండా తప్పించుకుని పోవచ్చును.

ఒక్క-క్షణం ఆలస్యం అయినా ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తికి ప్రాణాపాయం సంభవించవచ్చు.

రాజయ్య కిందపడ్డ వ్యక్తిని నడుంమీదకు బియ్యం బస్తాలా ఎత్తుకున్నాడు. అడుగులు చకచక వెయ్యటం మొదలుపెట్టాడు. గమ్యం తెలియదు. ఆ వూళ్ళో ఆసుపత్రి ఎక్కడవుందో డాక్టరు ఎక్కడ వున్నాడో. చూపు మేరలో నరసంచారం లేదు. తొందరగా నడవలేక పోతున్నాడు. ఆయాసం వస్తోంది. వళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి లోపల ఆదుర్దా. ఆవేదన లేకపోతే ఆ బరువు మొయ్యటం ఏమంత కష్టమైన పని కాదు.

వంతెన దాటాడు.

రథం దాటాడు.

అక్కడ వరండాలో ఎవరో మిషను కుట్టుతున్నాడు. అతన్ని అడిగాడు వైద్యుని సంగతి. అతను మిషను వదిలిపెట్టి పరుగు పరుగున వచ్చాడు. రథం పక్కసందులో డాక్టరిల్లు చూపించాడు.

డాక్టరుగారు కంగారుపడుతూ వచ్చాడు.

రాజయ్య అలాగే లోపలకు వెళ్ళి బల్లమీద పడుకోపెట్టి బయటకు వచ్చాడు.

'ఏమయింది...' మిషనువాడు అడిగాడు.

'లా రీ కిం ద ప డ్డా డు...' రాజయ్య రొప్పుతూ ఒక్కొక్క అక్షరమే పలికాడు.

'పాపం...'

రాజయ్య మనసు తేలికయింది.

'లారీవాడు తప్పించుకు పారిపోయాడు. వాడు దొరికితేనా ?' రాజయ్య ఏం చేశేవాడు ?...

ఆరోజు శంకరయ్యను ఏం చెయ్యగలిగాడు. అతనూ తప్పించుకుని పారిపోయాడు.

'దుర్మార్గులకి శిక్ష నివ్వటంలేదు భగవంతుడు...' అనుకున్నాడు రాజయ్య.

గోడ గడియారం గంటలు కొట్టింది.

ఉలిక్కిపడ్డాడు రాజయ్య. ఎవరో అతని వెన్ను చరిచినట్లయింది. ఇక్కడెందుకు కూర్చున్నావు ... ఫో ... సరివితోపు దగ్గరకు ఫో... మళ్ళీ శంకరయ్య దొరకడు... పోలీసుల చేతుల్లోకి చిక్కిన తర్వాత నువ్వేం చేయలేవు... ఇప్పుడే... తొందరగా...లే...' అంటూ రాజయ్య మనస్సు ఉత్తేజపరుస్తోంది. లేచాడు. అడుగులు వెయ్యలేక పోయాడు.

వాకిట్లో జనం చేరారు.

డాక్టరు ఎవరినీ లోపలకు రానియ్యటంలేదు.

'ఎవరు పడింది...'

'మన వూరివాడేనా...'

'ఎవరు ఆయన్ని తీసుకు వచ్చింది...'

'ఈయనేనా... నీ తల్లి కడుపు చల్లగా పది కాలాలపాటు వర్ధిల్లు నాయనా...'

'మా నాయనే... ఎంత మంచి మనస్సు ఇచ్చాడు నాయనా దేవుడు నీకు...'

'ఏ వూరు నాయనా... నీది......'

'ఒక ప్రాణాన్ని రక్షించావు... నీవి మామూలు చేతులు కావు నాయనా...'

'ఏం పనిమీద వచ్చావో...ఒక ప్రాణం నిలబెట్టావు...'

అంతా తలొకమాట అంటున్నారు.

రాజయ్య ఆ మాటల్ని వినలేక పోతున్నాడు. తను ఆ మాట లకి తగినవాడు కాదు. తను ఈ వూరు ఎందుకు వచ్చాడు. శివుని ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు. ఆ లారీ ఎందుకు రావాలి ? ఆ ప్రమాదం ఎందుకు జరగాలి? తను తలచినపని ఎందుకు భగ్నం కావాలి. ఈశ్వరేచ్ఛ ఇలాగే ఉందా! రాజయ్య మనస్సు పరిపరి విధాలపోతోంది.

అతన్ని అంతా పొగుడుతున్నారు. అవి భరించలేకుండా ఉన్నాడు. అక్కడినుంచి వెళ్ళిపోలేకుండా ఉన్నాడు. తను రక్షించిన వ్యక్తినుంచి తను కృతజ్ఞత కోరుతున్నాడా ? అక్కడ ఎందుకాగినట్లు అతని తాలూకు మనుష్యులంతా వస్తారు. నువ్వు మా కుటుంబం నిలబెట్టావు. అంటూ అతన్ని వేనోళ్ళ పొగుడుతారు. తను అక్కడినుంచి వెళ్ళి... శంకరయ్య తన చేతికి దొరికినా హాని చెయ్యగలడా... తన చెయ్యి పైకి లేస్తుందా... రాజయ్య కళ్ళు మండుతున్నాయి.

తను ఇటువంటి పరిస్థితుల్లో చిక్కుకుంటాడని ఊహించాడా...? తను శంకరయ్యను కత్తితో పొడుస్తాడు. వీలైతే పారిపోతాడు. పది మందిలో చిక్కితే తనకు జరిగిన అన్యాయం చెపుతాడు. కావాలనే చేశా నంటాడు. ఎవ్వరూ హర్షించరు. తనకు లెక్కలేదు. అందరూ కలసి తనను చావకొడతారు. తనకు భయం లేదు. నిండు గుండెతో అన్నీ భరించ గలడు. కాని... విపరీతమైన పరిస్థితుల్లో ఇరుక్కున్నాడు.

తన చేతికి సంకెళ్ళ బదులు పూలహారాలు చుట్టుకుంటున్నాయి. దూషణలకు బదులు భూషణలు తన మనస్సును కలవరపరుస్తున్నాయి.

ఇవన్నీ భరించలేక పోతున్నాడు.

గోడగడియారము అరగంట కొట్టింది.

డాక్టరు బయటికు వచ్చాడు. అందరికళ్ళు అతనివంక తిరిగినాయి. అతని ముఖంలో సంతోషరేఖ కనబడింది.

'భయంలేదు... బతుకుతాడు...' అన్నాడు.

గ్రీష్మంలో నిప్పులు చెరుగుతుండే రోజున చల్లనిగాలిలా వచ్చింది ఆ మాట అందరికీను.

'ఇంతకీ మనవూరివాడేనా... ఎవరాయన...' చాలామంది ఆదుర్దాగా అడిగారు.

'మన గూడెం శంకరయ్య...' అన్నాడు డాక్టరు.

రాజయ్య గుండెల్లో ఎవరో దేవినట్లయింది. ముఖం వివర్ణమయింది. చేతిలో సంచీ జారిపోయింది. యాంత్రికంగా ఒక్కసారి లేచాడు. డాక్టరుగారింట్లోకి డాక్టరుతోపాటు బయలుదేరాడు. ఎందుకు ?

తను వెంటాడుతున్న శంకరయ్య చేతికి దొరికాడనా ?

తను రక్షించిన వ్యక్తి గండంనుంచి బయట పడ్డాడనా ? ఏమో ! బహుశా రాజయ్యకిగూడా తెలియదేమో ! తనేం చేస్తున్నాడో ఎక్కడికి పోతున్నాడో తెలియకుండా అలాగే సాగిపోయాడు రాజయ్య.

( భారతి 1961)

—o—